www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 18 మే 2023

## వడదెబ్బతో వ్యక్తి మృతి

**ప్రజాశక్తి-వెదురుకుప్పం:** వడదెబ్బతో ఓవ్యక్తి మృతి చెందిన సంఘటన చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం పెద్దబైలు గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దబైలు గ్రామానికి చెందిన సాంబ శివరెడ్డి(65) మంగళవారం గ్రామానికి దగ్గరలోని తన పొలంలో పనులు చేసుకుని గట్టుపై ఎండ తీవ్రతను భరించలేక ఒక్కసారిగా స్పృహతప్పి పడిపోయాడు. చుట్టుపక్కల వారు వెళ్లి చూసేటప్పటికే మరణించారు. మతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

మృతుడు సాంబశివరెడ్డి (ఫైల్‌ఫొటో)

## బిజెపి పాలనకు అంతం ప్రారంభమైంది

**కర్ణాటక ఎన్నికల ఫలితాలే దీనికి నిదర్శనం**
**జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో**
**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు**

**ప్రజాశక్తి- తిరుపతి:** దేశంలో బిజెపి పాలనకు అంతం ప్రారంభమైందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఉద్ఘాటించారు. కర్ణాటక రాష్ట్రం ఎన్నికల ఫలితాలే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. తిరుపతిలోని ఎంబి భవన్‌లో బుధవారం నిర్వహించిన జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో సమావేశానికి ముఖ్యఅతిథిగా శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ నియంతత్వ విధానాలకు బిజెపి నిరంకుశ పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని అన్నారు. పెట్టుబడిదారులకు మాత్రమే మోడీ ప్రభుత్వంలో మేలు జరిగింది తప్ప మామూలు ప్రజలకు ఒరిగిందేమీలేదని అన్నారు. దేశప్రజలపై ఆర్థికదాడి జరుగుతోందని కోట్ల మందికి బతకుదెరువు లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ పనితీరును ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలపై మోడీ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని విరుచుకుపడ్డారు. రానున్న రోజుల్లో ఐక్యఉద్యమాలని బలోపేతం చేసి కేంద్రంపై పోరాటాన్ని ఉధతం చేస్తామని స్పష్టం చేశారు. కేరళ ఫైల్స్ పేరుతో వచ్చిన చిత్రంలో వాస్తవాలు లేవని, నిజంగా అది వాస్తవం అయితే 30వేల మంది యువతులు కేంద్ర ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు తెలియకుండా ఎలా విదేశాలకు వెళ్ళగలరని ప్రశ్నించారు. మోడీ హయాంలో గుజరాత్‌లో ఎన్ని ఘోరాలు జరిగాయో అందరికీ తెలుసునన్నారు. వాస్తవాలను వక్రీకరిస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ప్రజలు విసుగు చెందారని, నిరుద్యోగం రోజురోజుకీ పెరిగిపోతోందని వాపోయారు. ప్రజలు పోరాటాల్లోకి వస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని, ఆ దిశగా ప్రజల్ని చైతన్యవంతులను చేయాల్సి ఉందని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈసమావేశానికి ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య అధ్యక్షత వహించారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మూలం రమేష్, తిరుపతి జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి, జనార్ధన్, నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యంతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

## పింఛన్.. టెన్షన్..

- అనర్హత పేరుతో వేటు..
- తగ్గిపోనున్న సామాజిక పెన్షన్లు
- ఆందోళనలో వృద్ధులు

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:**

**వైఎస్సార్ పింఛన్‌లో భారీగా కోతలు పెడుతోంది ప్రభుత్వం.. నిబంధనల పేరుతో ఇప్పటికే పింఛన్ పొందుతున్న వారిని అనర్హులుగా తొలగిస్తోంది. విద్యుత్తు బిల్లులు ఎక్కువగా రావడం, ఇంటిస్థలాలు ఉండటం, నాలుగచక్రాల వాహనాలు ఇలా పింఛన్‌దార్ల సంఖ్య తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది..**

ఇప్పటికే చిత్తూరు నగరపాలిక పరిధిలో దాదాపు 700మందికి పైగా అనర్హులు పింఛన్ పొందుతున్నట్లు మెప్మా అధికారులు గుర్తించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వీరు వైఎస్ఆర్ సామాజిక పింఛన్ పొందేందుకు అనర్హులుగా గుర్తించిన అధికారులు వీరి వివరాలను మరోసారి ఇంటింటా సర్వే ద్వారా ధృవీకరించుకొని రద్దు చేసేందుకు నివేదికను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. అనర్హుల జాబితాలను ఆయా వార్డు సచివాలయ సిబ్బందికి అందజేశారు. వార్డు కార్యదర్శి ఇంటింటా సర్వేలో ప్రభుత్వ నిబంధనల మేరకు ఇంటి నిర్మాణం వెయ్యి చదరపు అడుగుల లోపు, నాలుగు చక్రాల వాహనాలున్నాయా (ఆటో, ట్రాక్టర్, టాక్సీ) మినహాయింపు ప్రభుత్వ ఉద్యోగి, పెన్షన్‌దారుడా, 300 యూనిట్ల లోపు విద్యుత్ వాడకం ఆదాయపు పన్ను చెల్లింపుదారులా అనే అంశాలను పరిశీలించి యాప్‌లో అనుసంధానం చేస్తున్నారు.

**వయస్సు ప్రతి బంధకాలు...**

ఒంటిరి మహిళలకు 50ఏళ్లు పైబడితేనే పింఛను మంజూరు చేయాలని ఉత్తర్వులు రావడంతో కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి ప్రతిబంధకంగా మారింది. గతంలో 35 ఏళ్లకే వస్తుండటంతో ఆ మేరకు దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వ తాజా నిర్ణయంతో పింఛన్ వచ్చే అవకాశం ఉండకపోవచ్చని మెప్మా అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో ఇకపై ఒంటి మహిళలు 50 ఏళ్ల తరువాత సామాజిక పింఛన్ మంజురు కోసం దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. ఎలాంటి ఆధారం లేక ప్రభుత్వం అందించే పింఛన్ వస్తుందని దరఖాస్తులు చేసుకున్న ఒంటిరి మహిళలు ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఇద్దెక్కడి న్యాయం అంటూ ప్రశ్నిస్తున్నారు.

**కొత్త పింఛన్లు వచ్చేనా...**

ప్రభుత్వ పింఛన్ మంజూరు కోసం సవాలక్ష ఆంక్షలు పెడుతోంది. మున్సిపాల్ ప్రాంతాల్లో 300యూనిట్ల లోపు విద్యుత్‌వాడకం, వెయ్యి చదరపు అడుగుల్లో ఇంటినిర్మాణం, కుటుంబంలోని వారికి రూ.15వేల లోపే నెలసరి ఆదాయం వంటి ఆంక్షలతో ప్రతి ఆరునెలలకోసారి వైఎస్ఆర్ సామాజిక పింఛన్‌ల మంజురు దరఖాస్తుల్లో అనర్హుల సంఖ్య భారీగా పెరిగే అవకాశముంది. మున్సిపల్ కమిషనర్, అదనపు కమిషనర్, ఆడిట్ అధికారి, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ఇంజనీర్లు బృందం పింఛన్ కోసం దరఖాస్తులను పరిశీలించి అర్హులకు పింఛన్ మంజూరు చేయాల్సి ఉంటుంది. ఈక్రమంలో తాజా ప్రభుత్వ నిబంధనలతో దరఖాస్తులు చేసుకొనే వారిలో 20 నుంచి 30 శాతం మినహా మిగిలిన వారి అర్హులు జాబితాలోకి వచ్చే అవకాశం లేదని స్వయంగా మెప్మా అధికారులే చెబుతున్నారు. మరోవైపు ఉన్న పింఛన్‌లో కోత తప్పదంటున్నారు. ఇంటింటా సర్వేలో ఇప్పటికే అందుతున్న పింఛన్ తీసుకుంటున్న వారిలో చిత్తూరు నగర పాలిక పరిధిలోని 50 డివిజన్లలో 16,738మంది వైఎస్ఆర్ సామాజిక పింఛన్ పొందుతున్నారు. వీరిలో 700మంది అనర్హులుగా గుర్తించారు. ఈ జాబితాలను జిల్లా కలెక్టర్, మెప్మా అధికారులు, కమిషనర్ పరిశీలిన తరువాత వైఎస్ఆర్ పింఛన్ జాబితా నుండి తొలగించే అవకాశమున్నట్లు మెప్మా అధికారులు చెబుతున్నారు.

**ఇచ్చే పింఛన్ ఆపేశారు..**
**- వళ్ళిమ్మ, ఇరువారం**

ఏడాదిరన్న పాటు అంటే జులై 2020 వరకు అప్పట్లో నెలకు రూ.2,225లు పింఛన్ వచ్చేది. నా కొడుకు మిలటరీలో ఉన్నాడు. ఒకే కార్డులో నా కొడుకు, కోడలు పిల్లలు ఉన్నారు. నీ కొడుకు మిటరీలో ఉన్నాడు అన్న కారణంతో వచ్చే పింఛన్ ఆపేశారు. నా కొడుకు వేరే కాపురం పెట్టినా కొత్తగా రేషన్‌కార్డు కోసం ఎన్ని దరఖాస్తులు పెట్టినా ఇవ్వడం లేదు. బియ్యం వాళ్ళే తీసుకుంటున్నారు. కొత్త కార్డు రాలేదు, పింఛన్ ఇవ్వడం లేదు. దీంతో ఎలా బతకాలో తెలిని పరిస్థితిలో ఉన్నాను..

**అర్హత ఉన్నా తిప్పుకుంటున్నారు...**
**- కృష్ణన్, భవన నిర్మాణ కార్మికుడు, ఇరువారం**

నాకు అంత్యోదయ యోజన పథకం క్రింద నెలకు 35 కేజీల బియ్యం ఇచ్చేవారు.. ఎందుకో తెలీదు సంవత్సరం క్రితం కార్డు రద్దు చేశారు. అప్పటి నుండీ రేషన్ కార్డు ఇవ్వాలని తిరుగుతున్నా, సచివాయంలో దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోవడం లేదు. 65 సంవత్సరాలు దాటి పోవడంతో పనిచేసే శక్తి లేదు. రేషన్ కార్డు లేకుంటే పింఛన్ కూడా రాదంటున్నారు.

**క్షేత్రస్థాయిలో వైద్యసేవలు విస్తృతం చేయండి**

## 19న శిక్షణ తరగతులు

వైద్య ఆరోగ్యశాఖ, ఐసిడిఎస్ అధికార్లతో సమీక్షిస్తున్న కలెక్టర్

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్యరంగంలో పలు సంస్కరణలు చేపట్టిందని, తద్వారా పేదలకు సత్వర వైద్యసేవలు పొందేందుకు అవకాశం కలదని ఈ దిశగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో జరుగుతున్న పలు కార్యక్రమాల ప్రగతిపై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సత్వర వైద్యసేవలు ప్రజలకు అందించేందుకు వైద్యరంగంలో పలు సంస్కరణలు తీసుకొని రావడం జరిగిందని, తద్వారా పేదలు సత్వర వైద్య సేవలు పొందేందుకు అవకాశం కలదని ఈ దిశగా మెడికల్ ఆఫీసర్లు పనిచేయాలని తెలిపారు. గర్భిణిలలో రక్తహీనత నివారణకు పూర్తిస్థాయిలో ప్రత్యేకశ్రద్ధ పెట్టి పనిచేయాలని అన్నారు. అలాగే ఏఎన్ఎం, ఆశాలు రోజూ వారి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకుంటూ వారు తీసుకోవల్సిన ఆహార నియమాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు వీరికి అవసరమైన వైద్యసేవలు అందించాలన్నారు. హైరిస్క్ గర్భిణీలపై, తీవ్ర రక్తహీనత గల గర్భిణీలపై ఆరోగ్యశాఖ సిబ్బంది ఎక్కువ శ్రద్ధ పెట్టి వారికి సుఖ ప్రసవం జరిగేలా కషి చేయాలన్నారు. ఈ నెలా 19న ప్రతి మండల కేంద్రంలో ఎంఎల్‌హెచ్‌పిలకు అవసరమైన శిక్షణా తరగతులను నిర్వహించాలని తెలిపారు. ఎన్‌సిడిసిడి సర్వేను పూర్తిచేయాలని ఫ్యామిలీ డాక్టర్ విధానంను పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. సుస్థిర అభివద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖకు కేటాయించిన లక్ష్యసాధనపై ప్రత్యేకదష్టి పెట్టి వైద్య ఆరోగ్యశాఖ పని చేయాలని ఆదేశించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ వై.మేఘస్వరూప్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రకాశం, డిసిహెచ్ఎస్ డాక్టర్ నాయక్, డిఐఓ డాక్టర్.రవిరాజు డిపిఎంఓ డాక్టర్ శ్రీనివాసరావు, డిసిఆర్‌బిఎస్‌కె డాక్టర్ సుదర్శన్, ఎస్ఓ రమేష్‌రెడ్డి, డిపిహెచ్ఎన్ఓ రేణుక ప్రభ, ఎపి డిమాలజిస్ట్ శ్రీవాణి, ఇతర సంబంధిత అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** ప్రతి బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా అందుకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు సిడిపిఓలు, సూపర్వైజర్లు పర్యవేక్షణను పెంచాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ అన్నారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో ట్రైనీ కలెక్టర్ స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి పిల్లవాడు ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా మోడ్రేట్, సివియర్ మాల్నేట్రిషన్ పిల్లలపట్ల ప్రత్యేకశ్రద్ధ పెట్టాలన్నారు. అలాగే వారిలోని ఆరోగ్య సమస్యల పరిష్కారానికి అవసరమైన పోషకాహారం నిమిత్తం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారంతో పాటు వారి తల్లిదండ్రులు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన పెంచేందుకు సిడిపిఓలు, సూపర్వైజర్లు వారికి నిర్దేశించిన లక్ష్యాల మేరకు పిల్లల ఇంటిని సందర్శించి తల్లిదండ్రులకు అవసరమైన సూచనలు తెలియజేయాలని అన్నారు. తద్వారా అంగన్వాడీ కేంద్రాలలో గల పిల్లల ఆరోగ్య స్థితిగతులతో పాటు క్షేత్ర స్థాయిలో స్త్రీ శిశుసంక్షేమ శాఖ ద్వారా జరుగుతున్న పథకాల తీరును తెలుసు కొనేందుకు అవకాశం ఉందన్నారు. ప్రతి బిడ్డకు జనన ధ్రువీకరణ పత్రంతోపాటు ఆధార్ కార్డు పొందేలా అందుకు అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతిబిడ్డకు ఆధార్ కార్డు ఉండడం ద్వారా ప్రభుత్వ పథకాలు పొందేందుకు అవకాశం ఏర్పడుతుందని ఈ దిశగా సిడిపిఓలు పనిచేయాలన్నారు. ఇందుకు సంబంధిత పోర్టల్‌పై సీడీపీఓలు, సూపర్వైజర్లు, అవగాహన పెంపొందించుకోవాలని, ఈ విషయంలో ఐసిడిఎస్ పిడి వారికి అవసరమైన శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని అన్నారు. ఈసమీక్షలో ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్, ఐసిడిఎస్ పిడి నాగశైలజ, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిడిపిఓలు, అధికారులు పాల్గొన్నారు.

## టేబుల్ వెరైటీల మార్కెటింగ్‌కు కృషి: కలెక్టర్

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** చిత్తూరు జిల్లాలో పండే మామిడి టేబుల్ వెరైటీలకు అవసరమైన మార్కెటింగ్ సౌకర్యానికి కషి చేస్తామని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, మామిడి రైతులతో, పల్ప్ ఇండస్ట్రీ యజమానులతో సమావేశమై జిల్లాలో పండే మామిడి టేబుల్ వెరైటీలకు గల మార్కెటింగ్ సౌకర్యాలపై చర్చించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తోతాపూరితో పాటు పండే మామిడి టేబుల్ వెరైటీలు అయినా బంగనపల్లి, ఇమామ్ పసంద్, లాల్‌బహర్, మల్లిక, కాలేపాడు, కేసర్, చెరకు రసం తదితర వెరైటీలు పండించే రైతులకుఅవసరమైన మార్కెటింగ్ సదుపాయంకు కషి చేస్తామని తెలిపారు. జిల్లాలో పండే పలు వెరైటీలకు మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలతో పాటు విదేశాలలో కూడా మంచి గిరాకీ ఉన్నట్టు తెలిపారు. ఈసందర్భంగా పలువురు రైతులు ఎఫ్‌పిఓల ద్వారా చేస్తున్న వ్యాపారం గురించి, కొందరు సొంతంగా బ్రాండ్ పేరుతో వ్యాపారం చేస్తున్నట్లు, మరి కొందరు ట్రేడర్లతో కలిసి వ్యాపారం చేస్తున్నట్లు కలెక్టర్‌కు తెలిపారు. మార్కెటింగ్ నిమిత్తం వారు అవలంభిస్తున్న పద్ధతులపై చర్చించారు. హార్టికల్చర్‌శాఖ ద్వారా రైతులకు అందిస్తున్న సబ్సిడీలతో కూడిన పథకాల గురించి జిల్లా హార్టికల్చర్ అధికారి మధుసూదన్ రెడ్డి వివరించారు. ఈ సమావేశంలో ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులు గోవర్ధన్ బాబి, కుమార్ రెడ్డి, రైతులు, ఎగుమతి దారులు పాల్గొన్నారు.

మామిడి రైతులు, గుజ్జు పరిశ్రమల యజమానులతో మాట్లాడుతున్న కలెక్టర్

## పనులు కల్పించడంలో ఇంత నిర్లక్ష్యమా..?

**ఉపాధి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసిన పిడి**

బహిరంగ సభలో ఉపాధి సిబ్బందిని ప్రశ్నిస్తున్న పిడి గంగాభవాని

**ప్రజాశక్తి- యాదమరి:** గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు ఉపాధి కూలీలకు పనులు కల్పించడంలో ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏంటని ఉపాధి హామీ పథక సంచాలకులు గంగాభవాని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం. వారంలో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సభకు పిడి హాజరైనారు. సామాజిక తనిఖీ బహిరంగ సభకు గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు ఉపాధి కూలీలు పూర్తిస్థాయిలో హాజరు కాలేదు. అలాగే స్థానిక ప్రజాప్రతినిధులు సైతం ఒకరిద్దరు తప్ప మరెవరు హాజరు కాలేదు. దీంతో సామాజిక తనిఖీ బహిరంగ సభ వెలవెలబోయింది. సోషల్ ఆడిట్ సమావేశంకు సామాజిక తనిఖీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్ మాత్రమే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథక సంచాలకులు మాట్లాడుతూ మండలంలో 26 గ్రామపంచాయతీలో సగానికి పైగా గ్రామపంచాయతీలో పూర్తిస్థాయిలో ఉపాధి పనులు జరగడం లేదని సిబ్బంది ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో కూలీల సంఖ్య పెంచే విధంగా క్షేత్రస్థాయిలో వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. రైతులకు అవసరమైన పనులు గుర్తించి వారికి సకాలంలో అంచనాలు తయారు చేయాలన్నారు. చిత్తూరు క్లస్టర్ ఏపీ డి.సుబ్రమణ్యంను వారం రోజులపాటు యాదమరి మండలంలో పర్యటించి కూలీల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల పరిధిలోని 2022- 23 ఆర్థిక సంవత్సరానికి జరిగిన పనులు సంబంధించి సామాజిక తనిఖీ నిర్వహించారు. మండల పరిధిలోని 1342 పనుల చేపట్టారు. ఇందులో పంచాయతీరాజ్ సంబంధించి 23పనులు గ్రామీణ నీటి సరఫరా సంబంధించి ఆరు పనులు చేపట్టారు. ఉపాధి కూలీలకు పని దినాలు38522035 కల్పించారు. మెటీరియల్ కాంపొండెంట్ 15661164 రూపాయలు చెల్లించడం జరిగింది. గతవారం రోజులుగా క్షేత్రస్థాయిలో పర్యటించి అందులో సంబంధించి 43,820 రికవరీ చేయడం జరిగింది. ఈసామాజిక తనిఖీ బహిరంగ సభకు డీఈవో భాగ్యలక్ష్మి సామాజిక తనిఖీ హమ్ బోర్డ్స్ మెన్ పద్మజ, చిత్తూరు ప్లస్ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో శివరాజ్, ఏపీవో బాల, ఎంపీసీ కవిత, ఈసీ రమ్య, టెక్నికల్ అసిస్టెంట్లు మధు మనోహర్ ఫీల్డ్ అసిస్టెంట్ల పాల్గొన్నారు.

## శుద్ధ.. సుందర.. తిరుమల విజయవంతం

**అధికారులు, ఉద్యోగులకు టీటీడీ ఈవో ధర్మారెడ్డి అభినందన**

**ప్రజాశక్తి- తిరుపతి సిటి:** తిరుమలను ప్లాస్టిక్ రహిత ఆధ్యాత్మిక క్షేత్రంగా మార్చేందుకు నిర్వహించిన శుద్ధ తిరుమల.. సుందర తిరుమల కార్యక్రమాన్ని టీటీడీ అధికారులు, ఉద్యోగులు, ఇతర విభాగాల సిబ్బంది విజయవంతం చేశారని టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి అభినందించారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ విభాగాల్లో పనిచేసేవారు, ఇతరులు స్వచ్ఛందంగా ఈకార్యక్రమంలో భాగస్వాములు కావడానికి ముందుకు వస్తే వారి సేవలు వినియోగించుకోవాలని ఆరోగ్యాధికారికి సూచించారు. తిరుపతి శ్రీపద్మావతి విశ్రాంతి గహంలో బుధవారం ఈవో సీనియర్ అధికారులతో సమీక్ష జరిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమలతో పాటు నడకదారుల్లోని దుకాణదారులకు పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. టాక్సీ, ప్రైవేట్ వాహనాలు , ఆర్టీసీ బస్సుల ద్వారా తిరుమలకు వెళ్ళే భక్తులకు ప్లాస్టిక్ ఉత్పత్తుల నిషేధంపై అవగాహన కల్పించడానికి పోలీస్, ఆర్టీసీ అధికారుల సహకారం తీసుకోవాలన్నారు. తిరుమలతో పాటు ఘాట్ రోడ్లు, నడకదారుల్లో ప్లాస్టిక్ ఉత్పత్తులను వాడకుండా భక్తులకు అవగాహన కల్పించేలా దుకాణదారులకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. విరివిగా చెత్తబుట్టలు ఏర్పాటు చేసి వ్యర్ధ పదార్థాలను అందులోనే వేసేలా అవగాహన కల్పించాలన్నారు. శ్రీ పద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భవనాల నిర్మాణం వేగం పెంచాలని ఆదేశించారు. ఆసుపత్రికి అవసరమయ్యే యంత్ర పరికరాల సమీకరణకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. స్విమ్స్, బర్డ్, చిన్నపిల్లల గుండె చికిత్సల ఆసుపత్రిలో రోగులు, సిబ్బంది, డాక్టర్లకు సౌకర్యవంతంగా ఉండేలా కేఫ్టెరియా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. వేద విశ్వవిద్యాలయంలో కొత్తగా ధ్యాన మందిరం నిర్మించి అక్కడ క్రియ యోగ శిక్షణ ఏర్పాటు చేయాలన్నారు. ఆధునిక జీవన విధానంపై వేదవిజ్ఞానం ప్రాముఖ్యతపై ఎస్వీ బీసీ కార్యక్రమాలు రూపొందించాలని ధర్మారెడ్డి చెప్పారు. తిరుమల అడవుల్లో అకేషియా చెట్ల తొలగింపు పై సమీక్షించారు. జేఈవో సదాభార్గవి, వీరబ్రహ్మం, ఎస్వీ బీసీ సీఈవో షణ్ముక్ కుమార్, లా ఆఫీసర్ వీరాజు, ఎఫ్ఏసిఎఓ బాలాజీ, చీఫ్ ఆడిట్ ఆఫీసర్ శేష శైలేంద్ర, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



## తిరుమలలో వేసవి రద్దీ

- నిండిన వైకుంఠం కాంప్లెక్స్
- క్యూలలో భక్తుల పడిగాపులు

**ప్రజాశక్తి- తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ ఎక్కువగానే ఉంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ భక్తులతో నిండిపోయాయి. బయట క్యూలైన్ కష్ణతేజ గెస్ట్‌హౌస్ వరకూ విస్తరించి ఉంది. అత్యధిక మంది భక్తులు రావడంతో టీటీడీ తగిన చర్యలు తీసుకుంది. అన్నప్రసాదాలను క్యూలైన్‌లోనే పంపిణీ చేయాలని నిర్ణయించింది. నడకదారిన వచ్చిన భక్తులకు శ్రీవారి దర్శనం ఐదు గంటల సమయం పైగానే పడుతుందని టిటిడి అధికారులు తెలిపారు. అలాగే ఉదయం ఏడు గంటలకు టోకెన్లు లేకుండా సర్వదర్శనం క్యూలైన్‌లో ప్రవేశించే భక్తులకు మాత్రం 24గంటల సమయం పడుతుందని అధికారులు తెలిపారు. ఈ నెల మొత్తం తిరుమలలో భక్తుల రద్దీ ఇలాగే ఉంటుందని చెబుతున్నారు. వేసవి సెలవులు పూర్తయ్యేంత వరకూ భక్తుల రద్దీ ఆగదని, ప్రజలు చూసుకుని తిరుమలకు రావాలని టీటీడీ అధికారులు కోరుతున్నారు. రూ.300ల ప్రత్యేక దర్శనం టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులకు శ్రీవారి దర్శనం మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుందని తెలిపారు. మంగళవారం తిరుమల శ్రీవారిని 77,436 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. వీరిలో 38,980 మంది భక్తులు తలనీలాలను సమర్పించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారని టీటీడీ అధికారులు వెల్లడించారు. శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.77కోట్లు వచ్చిందని అధికారులు తెలిపారు.

**శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టిక్కెట్ల షెడ్యూల్ విడుదల**

తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్లను బుక్ చేసుకునే భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా టిటిడి షెడ్యూల్ విడుదల చేసింది. సేవా టికెట్లు లేదా దర్శన టికెట్ల విడుదల తేదీ ఆదివారం వచ్చినట్లయితే వాటిని మరుసటి రోజు విడుదల చేస్తారు. ప్రతినెలా 18 నుంచి 20వ తేదీ వరకు సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మా రాధన ఆర్జిత సేవల లక్కీడిప్ కోసం నమోదు చేసుకోవచ్చు. 20 నుంచి 22వ తేదీ వరకు డిప్‌లో టికెట్లు పొందిన వాళ్లు సొమ్ము చెల్లించి వాటిని ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకార సేవలతోపాటు వర్చువల్ సేవాటికెట్లను 21వ తేదీన విడుదల చేస్తారు. శ్రీవాణి, ఆంగ ప్రదక్షిణం, వృద్ధులు, దివ్యాంగుల దర్శన టికెట్లు 23వ తేదీన విడుదలవుతాయి. రూ.300ల దర్శన టికెట్ల కోటాను 24న, తిరుపతిలో గదుల కోటాను 25న, తిరుమలలో గదుల కోటాను 26న విడుదల చేయడం జరుగుతుంది. భక్తులు గమనించి సేవా టికెట్లు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని టిటిడి కోరుతుంది.

**వార్డు, సచివాలయ**

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** వార్డు, గ్రామసచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి ఎన్‌జీవో జిల్లా అధ్యక్షులు రాఘవులు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారంపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులు ఏమండలంలో సమస్యలు ఎదుర్కొంటున్నారో తెలియజేస్తే పరిష్కానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షులు, ఏపీ జేఏసీ చైర్మన్ రాఘవులు, గ్రామ వార్డు సచివాలయం ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు సయ్యద్ బాష, సహా అధ్యక్షులు జ్యోతీశ్వర, కార్యదర్శి మహేష్, సహాయ కార్యదర్శి రవీంద్ర బాబు, కార్యవర్గ సభ్యులు మునెప్ప, సభ్యులు శివరాజ్, హేమంత్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌జీఓ నాయకులు రాఘవులు

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం: ఎమ్మెల్సీ

**ప్రజాశక్తి-రామకుప్పం:** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం అని ఎమ్మెల్సీ భరత్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద ఎమ్మెల్సీ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కార చర్యలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ వివిధ పథకాల ద్వారా ప్రతి కుటుంబం లబ్ధి పొందుతున్నారని తెలియజేశారు. రేషన్ కార్డులు, అమ్మ ఒడి, ఆసరా, నిరుపేదలకు గృహాలు మంజూరు తదితర సమస్యలను స్థానిక ప్రజలు తెలియజేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రజాప్రతినిధులు చొరవ తీసు కోవాలన్నారు. అనంతరం టిడిపి పార్టీకి చెందిన యువ నేత ముబారక్ ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా స్వాగతించారు. జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలకు ఆకర్షితుడై పార్టీలో చేరాడు అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుబ్రహ్మణ్యం, జడ్పిటిసి నితిన్ రెడ్డి, మండల కన్వీనర్ బాబు రెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, సర్పంచ్ మురళి తదితరులు పాల్గొన్నారు.

## జనుము విత్తనాల పంపిణీ

**ప్రజాశక్తి-నగరి:** స్థానిక వ్యవసాయ కార్యాలయంలో జనుము విత్తనాలను ఎంపీపీ భార్గవి బుధవారం రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించే జనుము విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విత్తనాలు అవసరమైన రైతులు పాసుపుస్తకాలు తీసుకొని వ్యవసాయ కార్యాలయంలోగానీ, ఆర్బీకేలలో గానీ విత్తనాలను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కన్నియప్ప, ఎంపీటీసీ ప్రదీప్‌యేసు, సర్పంచులు పరంధామన్, వెంకటేశ, మండల వ్యవసాయ అధికారి రాఘవేంద్ర యాదవ్, మండల సచివాలయ కన్వీనర్ హరి, రైతుభరోసా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఆరోగ్య నియమాలపై అవగాహన

**ప్రజాశక్తి-నగరి:** పట్టణంలో చిన్నారులకు అందిస్తున్న యోగా శిక్షణలో భాగంగా బుధవారం ఆరోగ్యానికి ఆచరించవలసిన నియమాలపై యోగా గురువు పుల్లయ్య ప్రత్యేక తరగతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరంలోని అవయవాలను పరిశుభ్రం చేయడం యోగాశనాలు, ప్రాణాయామం, ధ్యానం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. పాము కాటుకు భయపడని మనిషి దోమకాటుకు మరణిస్తున్నాడని, మనిషిలోని వ్యాధి నిరోధక శక్తి తగ్గుదలే దీనికి ప్రధాన కారణమన్నారు. దీనికి కారణం జీవన విధానంలో లోపమే అన్నారు. వీటన్నిటికీ పరిష్కారమార్గం యోగా అన్నారు. కార్యక్రమంలో యోగా రిసోర్స్‌పర్సన్‌లు బాబు, ఎల్లప్పరెడ్డి, హరిహరన్, అయ్యప్పన్, మీనాక్షిసుందరం, కష్ణమూర్తి పాల్గొన్నారు.

## గర్భిణులకు వైద్య పరీక్షలు

**ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి:** జిల్లా వైద్యాధికారుల ఆదేశాల మేరకు ధర్మపురి, చప్పిడి పల్లిలో గర్భిణులకు బుధవారం జిలాని ల్యాబ్ టెక్నీషియన్ రక్త పరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమంలో సావిత్రి హెల్త్ ఎడ్యుకేషన్ మాట్లాడుతూ గర్భిణులు ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకొని, రక్తహీనత నివారణకు పోషకాహారం తీసుకోవాలని, వ్యక్తిగత శుభ్రత, ఆసుపత్రిలో కాన్పులు, నవజాత శిశు సంరక్షణ, సీజనల్ వ్యాధులు, వడదెబ్బ నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పుష్పలత, లలితా, ప్రశాంతి, లక్ష్మీ ప్రసన్న, ఆశాలు పాల్గొన్నారు.

## ఘనంగా అర్జున తపస్సు

**ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు:** మండలంలోని గరిగలపల్లి వెంకటాపురం 18 గ్రామాలకు చెందిన శ్రీ ధర్మరాజుల ద్రౌపతి అమ్మవారి ఆలయంలో 15 వరోజు జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా బుధవారం అర్జున తపస్సు కార్యక్రమాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. అనంతరం ద్రౌపది, పాండవుల విగ్రహాలను పం బల వాయిద్యాల నడుమ మేళతాళాలతో ఊరేగింపుగా తపస్సు మాను వద్దకు తీసుకొచ్చారు. తరువాత భాగవతారిని మంజుల అర్జున తపసు హరికథా కాలక్షేపం చేశారు. తరువాత అర్జున పాత్రధారి నాగరాజు తపస్సుమాను వద్దకు చేరుకొని మెట్లు ఎక్కుతూ పద్యాలు పాడుతూ తపస్సుమాను పైకి చేరుకుని అక్కడి నుంచి విభూది, నిమ్మ పండ్లు వచ్చిన భక్తుల పైకి విసిరారు. ఇక్కడ బిడ్డలు లేని మహిళలు తపస్సు మాను వద్ద తడి బట్టలతో ఒరపడ్డారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమాన్ని ధర్మకర్తలు జె.రాజేంద్ర నాయుడు, టి. నాగరాజు నాయుడు ఆధ్వర్యంలో మహా భారతం నిర్వహించారు.

**సోమల:** మండల కేంద్రమైన సోమల పంచాయతీ భారతం మిట్ట నందు నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా బుధవారం అర్జున తపస్మాన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం తపస్మాన్ చెట్టును నాటి దానికి ప్రత్యేక పూజలు నిర్వహించి అర్జున వేషధారి పద్యాలు పాడుతూ చివరి వరకు వెళ్లి పైన ఉంచిన ప్రసాదాన్ని భక్తులకు పంచిపెట్టారు. కార్యక్రమాన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి



**ప్రజాశక్తి-కార్వేటినగరం:** ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కషి చేయాలని సమగ్ర శిక్షణ అసిస్టెంట్ జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ వెంకటరమణరెడ్డి అన్నారు. బుధవారం జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్) లో జగనన్న విద్యా కానుక కిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కానుక కిట్లు అందించాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు ప్రతి ఇంటికీ వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులను ఒప్పించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జగనన్న విద్యా కానుక కిట్లలో నాణ్యత లోపం లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట మండల విద్యాశాఖ అధికారి ఎం. విజయకుమార్, ఎస్ఎస్ఏ ఏఈ నాగభూషణం, సీఆర్పీ మీన, గణేష్ ఉన్నారు.

# రైతు భరోసా కేంద్రం ప్రారంభం



**ప్రజాశక్తి-గంగవరం:** మండలంలోని పసుపత్తూరు గ్రామ సచివాలయ పరిధిలోని పసుపత్తూరు, వీరిశెట్టిపల్లి, దొమ్మరిండ్లు, మార్జేపల్లి గ్రామాలలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మీ గడప వద్దకే మీ ఎమ్మెల్యే కార్యక్రమం బుధవారం జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులుతో కలిసి ఎమ్మెల్యే నిర్వహించి 322 గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటే గౌడ చేతుల మీదుగా రైతు భరోసా కేంద్ర భవనం, నూతనంగా ఏర్పాటు చేసిన నీటి బోరును, వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రం భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నారన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థలతో అవినీతికి ఆస్కారం లేకుండా నిజమైన లబ్ధిదారులకు ఇంటి వద్దకే పథకాలను అందజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరమణ, జడ్పిటిసి పార్వతమ్మ, చంద్రన్న మండల సర్పంచ్ అధ్యక్షుడు గిరిజా రెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దారి కల్పించాలని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు

**ప్రజాశక్తి-గంగవరం:** మండలంలోని గంగ్రాజుపల్లి పంచాయతీ మర్రిమాకులపల్లి గ్రామంలో తన పూర్వీకుల కాలం నుంచి తాను కాపురం ఉన్న ఇంటికి దారి కల్పించాలని గ్రామానికి చెందిన చిన్న రెడ్డప్ప గతంలో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో రెవెన్యూ అధికారులు గ్రామంలోకి వెళ్లి పరిశీలించి దారి కల్పించారు. అయితే ప్రస్తుతం అదే గ్రామానికి చెందిన కష్ణప్ప కుమారుడు గోవిందప్ప ఇల్లు కట్టుకోవడానికి చిన్న రెడ్డెప్ప దారికి అడ్డంగా గుణాధులు నిర్మిస్తున్నాడని అడిగితే నీ ఇష్టం ఉన్న వారికి చెప్పుకో ఎట్టి పరిస్థితుల్లోనూ దారి వదలడానికి వీలు లేదు అని మొరాయించడంతో విధిలేని పరిస్థితుల్లో చిన్న రెడ్డప్ప మళ్లీ స్థానిక తహశీల్దార్, ఆర్‌డిఓకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు ఆయన అన్నారు. తాను కూలి పనిచేసి జీవనం సాగిస్తున్నానని, ఉన్న కొంత జాగాలో ఇల్లు కట్టుకొని ఉన్నానని, పూర్వకాలం నుంచి ఉన్న దారిని ప్రస్తుతం అడ్డగించడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి నా ఇంటికి దారి కల్పించాలని కోరారు.

# రక్తపోటు దినోత్సవంపై అవగాహన

**ప్రజాశక్తి-పెనుమూరు:** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పెనుమూరు మండలం గంగుపల్లె సచివాలయం, వడ్డిగొడుసులు గ్రామంలో ఆరోగ్య వైద్యాధికారి రాజేంద్రప్రసాద్ 'ప్రపంచ రక్తపోటు దినోత్సవం' పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది మే 17వ తేదీన ఈ కార్యక్రమంతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం మారుతున్న జీవనశైలిలో ఎక్కువ మంది రక్తపోటుకు గురవుతున్నారని చెప్పారు. కానీ సరైన సమయంలో గుర్తించక హై బిపి, లో బిపి తో హార్ట్ ఫెయిల్యూర్స్, హార్ట్ స్ట్రోక్‌కు గురవుతున్నారని తెలిపారు. ప్రతి మనిషికి రక్తపోటు సాధారణ స్థాయి 120/80 ఉండాలన్నారు. 135/85 ఉంటే అధిక రక్తపోటుకు గురైనట్లు గుర్తించాలని చెప్పారు. ఇలాంటి వారికి ప్రమాదం ఎక్కువ అన్నారు. తల నొప్పి, తల తిరగటం, విపరీతమైన కోపం, చెమటలు పట్టుట, నీరసానికి గురవుట, రక్తనాళాలు దెబ్బతినటం, మెదడు , కిడ్నీ దెబ్బ తినటం చాలామందికి పై లక్షణాలు కనిపించకుండానే ప్రమాదకర హార్ట్ స్ట్రోక్స్‌కి గురవుతున్నారనీ అందుకే దీనిని సైలెంట్ కిల్లర్ వ్యాధి అంటారనీ చెప్పారు. ఒక్కసారి రక్తపోటుకు గురైతే జీవితాంతం మందులు వేసుకుంటూ ఉండాలన్నారు. సాధారణంగా జంక్ ఫుడ్స్ తినేవారికి, ఊబకాయులకు, పొగ ఉత్పత్తులు, ఆల్కహాల్ అలవాటు ఉన్నవారికి, శరీరక వ్యాయామం చేయని వారికి, ఉప్పు ఎక్కువ వాడేవారు రక్తపోటుకు గురవుతారని తెలిపారు. కావున పై అలవాట్లు లేకుండా ఆకుకూరలు, కాయగూరలు ప్రతిరోజు ఆహారంలో ఉండేటట్లు చూసుకుంటూ, చెడు అలవాట్లకు బానిస కాకుండా, ప్రతిరోజు శారీరక వ్యాయామం తప్పక చేస్తూ, మనసు ప్రశాంతంగా ఉంచుకుంటే రక్తపోటు రాదనీ చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# గరుడ వాహనంపై వేణుగోపాలస్వామి



**ప్రజాశక్తి-కార్వేటినగరం:** స్థానిక శ్రీవేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 5వ రోజు బుధవారం రాత్రి గరుడ వాహనంపై విహరిస్తూ స్వామివారు భక్తులను అనుగ్రహించారు. భక్తుల గోవింద నామస్మరణం, మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాటాలు, భక్త బందాల నత్య ప్రదర్శనల నడుమ ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం మోహినీ అవతారంలో పల్లకిలో దర్శనమిచ్చారు. తెల్లవారుజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. ఉదయం 7.30 నుంచి 9.30 వరకు మోహినీ అవతారంలో పల్లకిలో నగర వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. 10 నుంచి 11 గంటల వరకు రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకష్ణస్వామి ఉత్సవ మూర్తులకు వేద పండితులు వేదమంత్రోచ్చరణలతో స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. దూప దీప నైవేద్యాలు సమర్పించారు. రాత్రి టీటీడీ అధికారులు గరుడవాహన సేవకు పట్టు వస్త్రాలను సమర్పించారు. రాత్రి 8.30 గంటలకు విశేషాలంకతుడైన వేణుగోపాలుడు గరుడ వాహనంపై కొలువుదీరి పురవీధుల్లో విహరించారు. ఇంటింటా భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈవో మోహన్, సూపరింటెండెంట్ రమేష్‌బాబు, ఆలయ అధికారి సురేష్ కుమార్, కంకణ భట్టు గోపాలచారి, దసరథి, కిరణ్ భట్టాచార్యులు, సుందరవరదాచార్యులు, టీటీడీ ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# అందుబాటులో సబ్సిడీ వేరుశనగ విత్తనాలు



**ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం:** ఖరీఫ్‌లో వేరుశనగ పంటలు వేసుకోవడానికి అనుకూలమని, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సబ్సిడీ వేరుశనగ విత్తనాలు బుధవారం రైతు భరోసా కేంద్రాలకు చేరినట్లు మండల వ్యవసాయ అధికారి చిట్టి బాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఖరీఫ్ 2023లో పంటలు వేయ డానికి అవసరమైన చర్యలు చేపడుతుంది. ఎస్ఆర్ పురం మండలానికి 810 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు అవసరం కాగా ప్రస్తుతానికి 200 క్వింటాళ్ల విత్తనాలు రైతు భరోసా కేంద్రానికి వచ్చినట్లు తెలిపారు. త్వరలో అవసరమైన వేరుశనగ విత్తనాలు రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో రైతులకు అందిస్తుందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగపరుచు కోవాలని అన్నారు. దీనికితోడు వర్షాలు తోడవడంతో వ్యవ సాయ రంగంలో వినూత్న మార్పులు చోటు చేసుకున్నాయి. సాధారణంగా మన జిల్లాలో జులైలో వేరుశనగ, వరి పంటలు వేసుకోవడం జరుగుతుంది. ఈ ఏడాది మే నెలలోనే వర్షాలు కురవడంతో వర్షాధారంగా సాగు అయిన వేరుశనగ పంటని జూన్‌లోనే వేసుకోవడానికి రైతులు సిద్ధపడుతున్నారు.

వ్యవసాయాధికారి చిట్టి బాబు

## బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి

**ప్రజాశక్తి-నగరి:** బడిఈడు పిల్లలు బడిలో ఉండాలని, ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను గుర్తించి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ప్రధానోపాధ్యాయులు కుప్పరాజు బుధవారం స్థానిక ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి జగనన్న గోరు ముద్ద, జగనన్న విద్యా కానుక కిట్, పాఠ్యపుస్తకాలు, ఇతర ప్రభుత్వ ప్రోత్సాహకాలు గురించి ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య ఉంటుందని తెలిపారు. సీఆర్పీ శ్రీవాణి, మహిళా పోలీస్ సునీత, విద్యా కార్యదర్శి మురళి, వెల్ఫేర్ అసిస్టెంట్ సెక్రటరీ లక్ష్మీదేవి, అంగన్‌వాడీ వర్కర్లు సలీమా, మీన, వాలంటీర్లు మౌనిక, గిరి పాల్గొన్నారు.

## దుస్థితిలో రహదారులు

**ప్రజాశక్తి-పెద్దపంజాణి:** మండల పరిధిలోని పుంగనూరు నుంచి రాయలపేట గ్రామానికి వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు గుంతల మయంగా ఉన్నాయి. ఆ రోడ్లలో మోటార్ వాహనాలు, బస్సుల్లో ప్రయాణించాలంటే ప్రయాణికులకు ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలోని నగిరేపల్లి గ్రామం నుంచి రాయలపేట వరకు దాదాపు పది కిలో మీటర్లు ప్రయాణికులు ప్రయాణించాలంటే రహదారులు ఉన్న గుంతల వల్ల ఒళ్ళు గుళ్ళు అవుతుందని కొళ్లతూరు, చెన్నారెడ్డిపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రహదారిలో పుంగనూరుకు బస్సు వెళుతుందని, నిత్యం దాదాపు 500 మంది ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు ఈ రోడ్డులో వెళ్తున్నారని తెలిపారు. కొళ్లతూరు పంచాయతీలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ప్రజలు ఈ రోడ్డు సమస్యపై స్థానిక ఎమ్మెల్యేకు నివేదించారు. ఈ రోడ్డు పనులు వెంటనే మరమ్మతులు చేపడతామని వారికి హామీ ఇచ్చినట్లు స్థానిక ప్రజలు తెలియజేశారు. ఇప్పటివరకు రోడ్డు మరమ్మతు పనులు జరగలేదని ఇకనైనా ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు చొరవ తీసుకొని ఆర్ అండ్ బి రోడ్డు నిర్మాణ పనులు చేయాలని స్థానిక గ్రామస్తులు కోరుతున్నారు.

## వైభవంగా గంగజాతర

**ప్రజాశక్తి-నగరి:** మున్సిపాలిటీ పరిధిలోని కరకంతాపురంలో జరుగుతున్న గంగమ్మ జాతర వేడుకలలో రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక వ్యవహారాల, యువజన క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు వై.రాంప్రసాద్ రెడ్డి బుధవారం మధ్యాహ్నం పాల్గొన్నారు. అనంతరం ఆయన గంగమ్మ తల్లిని దర్శనం చేసుకున్నారు. మండలంలోని ముడిపల్లి, వీకేఆర్‌పురం, గుడికంద్రిగ, మిట్టపాళెం, మూలనత్తం, ఎం.కొత్తూరు, కష్ణారామాపురం గ్రామాల్లో, మునిసిపల్ పరిధి కీళపట్టు, కరకంతాపురం ప్రాంతాల్లో బుధవారం గంగజాతర వైభవంగా జరిగింది. వేకువజామున గంగమ్మను ఊరేగింపుగా తీసుకువచ్చి వేపాకు గుడిసెలో చేర్చారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన వీధినాటకాలు, నత్యాలు స్థానికులను అలరించాయి. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారికి చీరలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వేపాకు సారెలు, వెయ్యికన్నుల దుత్తల్లో దీపాలు సమర్పించారు. తడిబట్టలతో అంగప్రదక్షిణం చేశారు. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు గంగమ్మకు నైవేద్యం సమర్పించి కర్పూర హారతులు స్వీకరించారు. బలిఅన్నం సమర్పించి రాత్రి గంగమ్మను ఊరేగింపుగా తీసుకెళ్ళి పొలిమేర దాటించారు.

## ముత్య గంగమ్మ సేవలో డిప్యూటీ సీఎం

**ప్రజాశక్తి-పెనుమూరు:** మండలంలోని ఉగ్రహణంపల్లెలో వెలిసిన ముత్య గంగమ్మకు బుధవారం వైభవంగా జాతర జరిగింది. దీంతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేపట్టారు. స్థానిక సర్పంచ్ ఐరాల మురళి కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పరిసర గ్రామస్తులు ముత్యమ్మ ఆలయం మట్టితో గంగమ్మ విగ్రహ ప్రతిష్ట చేపట్టారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి పొంగళ్ళు పెట్టి నైవేద్యం సమర్పించారు. భక్తులు పిండి దీపాలు వెలిగించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేపట్టారు. కార్యక్రమంలో పార్థసారథి రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రాజేష్, బద్రి, కనకరాజులు, కోటేశ్వర రెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, శివకోటి, పద్మనాభ రెడ్డి, దేవేంద్ర రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటి సర్వే

**ప్రజాశక్తి-వెదురుకుప్పం:** మండలంలోని వెదురుకుప్పం పంచాయతీలో బుధవారం బూత్ నెంబర్ 52లో ఇంటింటి సర్వే, ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమం వెదురుకుప్పం క్లస్టర్ ఇన్‌ఛార్జ్ పి.మోహన్ మురళి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హౌస్, ఓటర్ వెరిఫికేషన్ నూరు శాతం పూర్తి చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బూత్ కమిటీ కన్వీనర్ టి.నాదముని, పంచాయతీ నాయకులు ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ సర్పంచ్ మృతి

బాలాజీ పాతచిత్రం

**ప్రజాశక్తి-బంగారుపాళ్యం:** చికిత్స పొందుతూ సర్పంచ్ మృతి చెందిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు...కాట్టప్పగారి పల్లి పంచాయతీ సర్పంచ్ బాలాజీ గత నాలుగు రోజుల ముందు బంగారుపాళ్యం నుంచి స్వగ్రామం కాటప్పగారి పల్లి పంచాయతీ ఎద్దులవారి పల్లి గ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా అదుపు తప్పి ద్విచక్ర వాహనం బోల్తా పడిన ఘటనలో గాయాలయ్యాయి. చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేసి, మెరుగైన చికిత్సకు తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం సర్పంచ్ బాలాజీ మృతి చెందాడు. దీంతో మండల ప్రజా ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

## బిఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణానికి భూమి అప్పగింత



**ప్రజాశక్తి-రామకుప్పం:** జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మండల తహశీల్దార్ మురళి, జడ్పిటిసి నితిన్ రెడ్డి మండ లంలోని బిఎస్ఎన్ఎల్ టవర్ నిర్మా ణానికి భూమి సేకరించి బిఎస్ ఎన్ఎల్ డిజిటల్ ఇంజినీర్‌కు అప్ప గించారు. ఈ సందర్భంగా మండ లంలోని గాంధీనగర్, ఆరిమాను పెంట, ననియాల, వెంకటాపురం, మణేంద్రం, గురుకుల మడుగు, విజలాపురం గ్రామాల్లో 4జి కవరేజ్ టవర్లను నిర్మించనున్నట్లు వారు తెలిపారు.

## పుస్తక పఠనంతోనే విజ్ఞానం

**ప్రజాశక్తి-సోమల:** విద్యార్థులు పుస్తక పఠనంతోనే విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు నాగయ్య అన్నారు. బుధవారం గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన సోమల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గ్రంథాలయాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులచే పాటలు, పద్యాలు పాడించి గెలుపొందిన వారికి గ్రంథాలయ అధికారి రామకష్ణతో బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ఇందిరమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

## తాగునీటి పైపులైనుకు మరమ్మతు చేయాలి

**ప్రజాశక్తి-విజయపురం:** మండలంలోని పాతర్కడులో గత నెల రోజు లుగా పైప్‌లైన్ లీకేజీతో తాగునీరు నిలిచి మురికి నీరుగా మారు తుందని, వాటి వల్ల రోగాలు ప్రభలుతాయని గ్రామస్తులు బుధ వారం ఆరోపించారు. స్టార్టర్ మరమ్మతుకు గురికావడంతో తాగు నీరు ఇబ్బంది ఎదుర్కొంటున్నామని, అధికారులు స్పందించి వెంటనే తగు చర్య తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## జాబ్ మేళాలో 50 మంది ఎంపిక

**ప్రజాశక్తి-గూడూరు టౌన్ :** గూడూరు పట్టణంలోని ఐటీఐ కళాశాలలో నిర్వహించిన మినీ జాబ్ మేళాలో రాష్ట్రానికి చెందిన నాలుగు ప్రముఖ కంపెనీలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ తిరుపతి జిల్లా ప్లేస్మెంట్ ఆఫీసర్ గణేష్ మాట్లాడుతూ జాబ్ మేళాలో సుమారు 100 మంది అభ్యర్థులు పాల్గొనగా 50 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. జాబ్ మేళాలో పాల్గొన్న అభ్యర్థులకు సేవ్ ది చిల్డ్రన్ సంస్థ సభ్యులు మధ్యాహ్నం భోజనాన్ని అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీరాములురెడ్డి, వెంకటేశ్వరరావు, శ్రావణ్, గీతా మాధురి, పాపారావు పాల్గొన్నారు.

## అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

**ప్రజాశక్తి-సత్యవేడు:** సత్యవేడు మండల వ్యవసాయ సలహా సంఘం సమావేశానికి పలువురు అధికారులు డుమ్మా కొట్టడంపై స్థానిక వ్యవసాయ మండల సలహా సంఘం ఛైర్మన్ శ్యాంప్రసాద్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ఆత్మ భవనంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన మండల వ్యవసాయ సలహా సంఘం సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతులను ఆదుకోవాలని ఉద్దేశంతో ప్రభుత్వం వ్యవసాయ సలహా సంఘాలను ఏర్పాటు చేసిందన్నారు.అయితే సమావేశానికి పలువురు అధికారులు గైర్హాజరు కావడంపై అసంతప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా విద్యుత్తు, ఉద్యానవన శాఖ, మార్కెటింగ్ శాఖ, మత్స్యశాఖ అధికారులు రావడంలేదని ఆయన ఆరోపించారు. అధికారుల గైరాజపై నివేదికను జిల్లా అధికారులకు పంపాలని వ్యవసాయ అధికారులను కోరారు. వ్యవసాయ శాఖ ఏవో మురళి రైతులకు పలు సూచనలు చేశారు. ఇరుగుళం పశువైద్యులు డాక్టర్ దయాకర్ మాట్లాడుతూ వైయస్ఆర్ పశు వైద్య సంచార వాహనాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో టీటీ రవిచంద్రబాబు, వీఆర్వో ఇళయరాజ, సచివాలయ వ్యవసాయ అసిస్టెంట్లు మదన్మోహన్, స్వర్ణ, మురళి, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.